క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామి ఆలయంలో సీఐ పూజలు



కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురంలో వెలిసిన పాగుంట లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయానికి సోమవారం సంక్రాంతి పండుగ సందర్భంగా గద్వాల సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు వెంకటేష్, ఆనంద్ హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు స్వామివారికి అభిషేకం నిర్వహించి శాలువాతో సన్మానించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. వారి వెంట సిబ్బంది తులసిరెడ్డి, మోహన్ ఉన్నారు.

పాత సామగ్రి దగ్ధం

గద్వాల క్రైం: ప్రమాదవశాత్తు పాత సామగ్రి దుకాణంలో సామగ్రి దగ్ధమైన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. బాధితుడు, స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ధరూర్ మెట్ కాలనీకి చెందిన రామన్న రాఘవేంద్ర కాలనీ సమీపంలో పాత సామగ్రి కొనుగోలు దుకాణం ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. అయితే ప్రమాదవశాత్తు దుకాణంలో మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో రూ.2 లక్ష మేర నష్టం చోటుచేసుకున్నట్లు తెలిపారు. సకాలంలో ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

గద్వాల క్రైం: గుర్తుతెలియని వాహనం ఢీకొట్టిన సంఘటనలో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన గద్వాల మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కేటీదొడ్డి మండలం మల్లాపురం తండాకు చెందిన శ్రీనునాయక్ మంగళవారం రాత్రి ఎర్రవల్లి నుంచి గద్వాల వైపు బైక్‌పై వెళ్తున్నాడు. పూటాన్‌పల్లి స్టేజీ సమీపానికి రాగానే గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర రక్త గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలియజేశారు.

ఘనంగా మడివాళ్ల మాచయ్య జయంతి



అమరచింత: పట్టణంలో రజకుల కుల దైవమైన మడివాళ్ల మాచయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో పట్టణ పురవీధు గుండా భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. అనంతరం విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలోని మాచయ్య ఆలయంలో ఘనంగా పూజలు చేశారు. భక్తులకు అన్నదానంతో పాటు తీర్థప్రసాదాలను అందించారు. ఈమేరకు రజక సంఘం జిల్లా అధ్యక్షుడు బండలయ్య మాట్లాడుతూ ప్రతి ఏడాది సంక్రాంతి పర్వదినం రోజున తమ ఆరాధ్య దైవమైన మడివాళ్ళ మాచయ్య జయంతిని క్రమం తప్పకుండా నిర్వహించడం జరుగుతున్నదన్నారు. కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షుడు సుతారి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి సవరన్న, కోరిశ్రీనివాసులు, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రాప్ హాలిడే పేరుతో నీటిని తరలించే కుట్ర

అమరచింత: దిగువ ఆయకట్టు రైతులకు సాగునీటిని విడుదల చేయాలని ఇవ్వాలని మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించడం ఎంత వరకు సమంజసమని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మేర్వరాజు అన్నారు. మంగళవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జూరాల ఆయకట్టు రైతుల బాధలను ప్రభుత్వం పట్టించుకోవట్లేదని ఆరోపించారు. జూరాల ప్రాజెక్టు ఆయకట్టుకు యాసంగిలో సాగునీరు ఇవ్వలేమని ఆయకట్టుకు క్రాప్ హాలిడే ప్రకటించిన ప్రభుత్వం.. ప్రస్తుతం దిగువ ఆయకట్టు రైతులకు సాగునీరు అవసరం అంటూ నీటిని తరలించుకుని పోవాలన్న డ్రామాలు ఇకపై ఎగువ ఆయకట్టు రైతులు సాగనివ్వరన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు మంత్రి నిరంజన్‌రెడ్డి జూరాల నుంచి నీటిని అక్రమంగా తరలించుకుని వెళ్తున్న సందర్భంలో మక్తల్ నియోజక బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి పట్టించుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం మారినా నీటి తరలింపు మాత్రం ఆగట్లేదన్నారు. మక్తల్ నియోజకవర్గంలోనే కృష్ణానది అధికంగా ప్రవహిస్తున్నా ఈప్రాంత ప్రజలకు సాగునీటి కష్టాలు తప్పడం లేదని అసహనం వ్యక్తం చేశారు. జూరాల ఆయకట్టు దిగువ ప్రాంతాలైన వనపర్తి, వీపనగండ్ల, కొల్లాపూర్‌లకు సాగునీటిని యాసంగి సాగు కోసమే తరలించుకుని వెళ్లేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇకనైనా మంత్రి జూపల్లి తన నిర్ణయాన్ని మార్చుకోవాలని లేని పక్షంలో రైతుల పక్షాన ఆందోళనలు చేస్తామన్నారు. సమావేశంలో బీజేపీ పట్టణ కార్యదర్శి దుబాయ్ వెంకటేశ్వర్ రెడ్డి, వాటర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.



ధరూరులో ఓ ఇంటి ఎదుట సంక్రాంతి ముగ్గు వేస్తున్న యువతి



అలంపూర్‌లో ముగ్గుల పోటీలు పరిశీలిస్తున్న న్యాయ నిర్ణేతలు



రామాపురంలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు



గద్వాల పట్టణంలో సుంకులమ్మ మెట్టులోని ఓ ఇంటి ఎదుట వేసిన ముగ్గు

సందడిగా సంక్రాంతి

అలంపూర్/ అయిజ/గద్వాల/ అర్బన్ రాజోళి/ మానవపాడు/ధరూరు/ ఎర్రవల్లిచౌరస్తా: సంక్రాంతి పండుగను గద్వాల పట్టణంలో ప్రజలు సంబురంగా జరుపుకొన్నారు. మొదటి రోజు భోగి, రెండో రోజు సంక్రాంతి, మూడో రోజు కనుమను ఉత్సాహంగా జరుపుకొన్నరు. ప్రతి ఇంట్లో బంధువులు సందడి చేశారు. మహిళలు, యువతులు తెల్లవారు జామునే తీరొక్క రంగులతో అందమైన ముగ్గులు వేశారు. అందులో గొరమ్మలను పెట్టి నవధాన్యాలు పోశారు. సౌభాగ్యాలకు ఆహ్వానం పలుకుతూ.. భోగి, సంక్రాంతి, కనుమ పండగలను అత్యంత వైభంగా నిర్వహించుకున్నారు. యువకలు భోగి మంటలు, గాలిపటాలు ఎగురవేశారు. మహిళలు ఇంటి ముందు కల్లాపి చల్లి రంగుల ముగ్గులు వేశారు. పట్టణంలోని దక్షిణ కాశీ అలంపూర్ క్షేత్రంలో వెలిసిన బాలబ్రహ్మేశ్వర స్వామి, జోగుళాంబ అమ్మవారి ఆలయానికి వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు తరలి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వివేకానంద యూత్ సొసైటీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. అయిజ, పుల్లూరులో ఆట–పోటలు రసవత్తరంగా కొనసాగించారు.



అలంపూర్‌లో ముగ్గుల పోటీల్లో మహిళలు



ఎర్రవల్లిలో ఇంటి ముందు రంగులతో ముగ్గులు వేస్తున్న యువతి



గద్వాల పట్టణంలో బుర్దపేటలోని ఓ ఇంటి ముందు వేసిన ముగ్గు ఇలా



గద్వాల పట్టణంలో వేదనగర్‌లోని ఓ ఇంటి ముందు వేసిన ముగ్గు

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు

ధరూరు: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని పెద్దపాడులో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. సోమవారం రాత్రి మండల పరిధిలోని పెద్దపాడులో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి మాజీ మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ బండ్ల లక్ష్మీదేవి, మండల ఎంపీపీ నజీమున్నీసా బేగం ముఖ్య అతిథులుగా హాజరై నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో చింతరేవుల సురేష్, చిన్నపాడు ఆంజనేయులు, రాములు, గోపాల్, వెంకటేష్, అంజి, రాములు, శ్రీను, రాజు తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న నాయకులు

శాంతినగర్: వడ్డేపల్లి మండల పరిధిలోని రామాపురంలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీలు ఎంతగానో ఆకట్టుకున్నారు. సంక్రాంతి రంగవల్లుల కార్యక్రమంలో భాగంగా గ్రామపెద్దలు, గ్రామయూత్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి రూ.5 వేలు, రెండో బహుమతి రూ.4 వేలు, మూడో బహుమతి రూ.3 వేలు, నాలుగో బహుమతి రూ.2 వేలు, ఐదో బహుమతి రూ.వెయ్యి విలువైన గృహోపకరణాలు అందజేశారు. భీమేశ్వర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, లక్ష్మన్న, అజయ్‌గౌడ్, గజేందర్ రెడ్డి పాల్గొన్నారు.

అలంపూర్‌లో..

అలంపూర్: సంక్రాంతి పురస్కరించుకొని అత్యంత వైభవంగా నిర్వహించిన ముగ్గుల పోటీలు ముగిశాయి. విజేతలకు దాతల సహకారంతో బహుమతులు అందజేశారు. అలంపూర్ మున్సిపాలిటీలోని స్వామి వివేకానంద యూత్ సొసైటీ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని, పట్టణంలోని జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయ సముదాయంలోని తుంగభద్ర పుష్కరఘాట్‌లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీలకు మున్సిపాలిటీలోని ఆయా కాలనీలకు చెందిన మహిళలు పెద్దఎత్తున హాజరయ్యారు. రంగు రంగులతో విశేషంగా ఆకర్షించే ముగ్గులు వేశారు. న్యాయ నిర్ణేతలు వాటిని పరిశీలించి విజేతలను ఎంపిక చేశారు. సుభాషిని, మీనా, భారతి, పూజ వరుసగా నాలుగు బాహుమతులు గెలుచుకున్నారు. వివేకానంద యూత్ సొసైటీ అధ్యక్షుడు రజినిబాబు బహుమతులు అందజేశారు. చిన్నకృష్ణయ్య నాయుడు, శేఖర్ రెడ్డి, నారాయణ రెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



అలంపూర్‌లో ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు అందజేస్తున్న నాయకులు

వాహనదారులు నిబంధనలు పాటించాలి



ధరూరు వైఎస్సార్ చౌరస్తాలో వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ధరూరు: ద్విచక్ర వాహనాలు నడిపే వారు నియమ, నిబంధనలు పాటించాలని రేవులపల్లి హెడ్‌కానిస్టేబుల్ హుస్సేన్ అన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం రాత్రి ధరూరులోని వైఎస్సార్ చౌరస్తాలో ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ వాహన ధ్రువీకరణ పత్రాలతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. అలాగే వాహనానికి ఇన్సూరెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. ఏదైనా అనుకోని ప్రమాద సంఘటన జరిగినప్పుడు ఉపయోగపడే అవకాశం ఉంటుందన్నారు. కేవలం ఏడాదికి రూ.1,500 ఉంటుందన్నారు. దానిని నిర్లక్ష్యం చేయడంతో అనేక నష్టాలు ఉంటాయన్నారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. తద్వారా తలకు సేఫ్టీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో పోలీసులు గోపి, కరుణాకర్, జగన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆరగిద్దలో వైభవంగా రథోత్సవం



గట్టు: మండల పరిధిలోని ఆరగిద్దలో శివ వీరాంజనేయస్వామి రథోత్సవం సోమవారం రాత్రి కనుల పండువగా నిర్వహించారు. ఆరగిద్దలో ప్రతి ఏటా సంక్రాంతి రోజున జాతర నిర్వహిస్తారు. ఇలా జాతర, పండుగలను కలిపి ఒకే రోజున నిర్వహించుకుంటారు. జాతరలో భాగంగానే స్వామి వారి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. రథోత్సవం సందర్భంగా స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పల్లకీసేవ అనంతరం స్వామి వారి ఉత్సవ మూర్తి విగ్రహాన్ని రథంపై ఏర్పాటు చేసి, రథాన్ని లాగారు. చుట్టుపక్కల గ్రామాలతో పాటుగా గ్రామస్తులు రథోత్సవాన్ని తిలకించడానికి పెద్దఎత్తున తరలివచ్చారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

చేసిన సేవలు మరవొద్దు

అయిజ: దేశంలోని మారుమూల గ్రామాల్లో పుట్టిన అనేక మంది ఆణిముత్యాలుగా పేరొందారని, వారు చేసిన సేవలు మరవొద్దని సీబీఐ మాజీ జడ్జి నాగం మారుతి శర్మ అన్నారు. మండలంలోని చిన్న తాండ్రపాడులో సోమవారం జయంతి బాబురావు సంస్మరణ సభను ఆయన కుమారులు సుప్రీం కోర్టు స్టాండిగ్ కౌన్సిల్ శ్రావణ్ కుమార్, అమర్నాథ్, కిషోర్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మారుమూల గ్రామాల్లో అనేక మంది మహానుబావులు పుట్టారని, వారి సంతానాన్ని ప్రయోజకులు చేసి దేశానికి సేవలందించేందుకు పంపారని అన్నారు. అందుకు ఉదాహరణ జయంతి బాబురావని కొనియాడారు. అదేవిధంగా సుంప్రీంకోర్టు స్టాండింగ్ కౌన్సిల్ శ్రావణ్‌కుమార్ మాట్లాడారు. తన తండ్రి బతికి ఉన్నంత కాలం గ్రామాభివృద్ధిలో మమేకమయ్యారని, తానూ వీలైనంత వరకు గ్రామాభివృద్ధిలో పాలుపంచుకుంటానని అన్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గలొన్నారు.



సంస్మరణ సభలో సీబీఐ మాజీ జడ్జి నాగం మారుతి శర్మ

క్రీడాకారులకు బహుమతుల ప్రదానం

అయిజ: సంక్రాంతి సందర్భంగా మండల కేంద్రంలో, మండలంలోని యాపదిన్నె, సంకాపురం గ్రామాల్లో నిర్వహించిన క్రికెట్, వాలీబాల్ పోటీల విజేతలకు సోమవారం బహుమతులు అందజేశారు. మండల కేంద్రంలో అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు క్రికెట్ క్రీడల్లో పాల్గొని విజేతలైన వారికి నగదు బహుమతులు అందజేశారు. యాపదిన్నెలో క్రికెట్ క్రీడల్లో విజయం సాధించిన వారికి ఎస్ఐ నరేష్ కుమార్ బహుమతులు అందజేశారు. సంకాపురంలో వాలీబాల్ క్రీడల్లో విజేతలైన వారికి సర్పంచ్ సుజాత బహుమతి అందజేశారు. క్రీడాకారులు, వివిధ పార్టీల నాయకులు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

సంక్రాంతిని పురస్కరించుకుని

మల్దకల్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండలంలోని ఎల్కూరు, అమరవాయి, మల్దకల్, బిజ్వారం గ్రామాల్లో నిర్వహించిన క్రికెట్, ముగ్గుల పోటీల విజేతలకు సోమవారం ఆయా గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు బహుమతులు ప్రదానం చేశారు. ప్రతి ఏటా సంక్రాంతి సందర్భంగా ఆయా గ్రామాల్లో వివిధ క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తున్నట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజారెడ్డి, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



అమరవాయిలో క్రికెట్ విజేతలకు బహుమతి అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బల్గెరలో ఎడ్లబండ్ల గిరక పోటీలు



బల్గెరలో ఎడ్లబండ్ల గిరక పోటీలు ప్రారంభిస్తున్న హనుమంతు



బల్గెరలో నిర్వహిస్తున్న ఎడ్లబండ్ల గిరక పోటీలు

గట్టు: మండల పరిధిలోని బల్గెరలో సంక్రాంతి కనుమ పండుగ సందర్భంగా మంగళవారం ఎడ్లబండ్ల గిరక పోటీలు నిర్వహించారు. పండుగ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో రైతులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎడ్ల బండ్ల గిరక పోటీలను సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బల్గెర హనుమంతు ప్రారంభించారు. సిరన్నగాళ్ల చిన్న అయ్యన్నకు చెందిన ఎద్దుల బండి మొదటి బహుమతి రూ.3,500 దక్కించుకుంది. రాళ్లకుంట చిన్న ఈరన్నకు చెందిన ఎద్దులు ద్వితీయ బహుమతి రూ.2,500 దక్కించుకున్నాయి. కంత బసయ్యగాళ్ల రామకృష్ణ ఎద్దులు తృతీయ బహుమతి రూ.1,500 దక్కించుకున్నాయి. విజేతలకు సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బల్గెర హనుమంతు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, రైతులు పాల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్య రాముడి అక్షతలు



అలంపూర్ చౌరస్తాలో శ్రీరాముడి అక్షతలతో భక్తుల ఊరేగింపు

అలంపూర్: అయోధ్య రాముడు అక్షతలు ఇంటికీ చేరవేస్తున్నారు. ఆలయ కమిటీ సభ్యులు స్థానిక భక్తులతో కలిసి ఆభయ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపుగా శ్రీరాముడి నామస్మరణ చేస్తూ.. ఇంటింటికీ వెళ్లి అక్షతలను అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, చిన్నారులు పాల్గొన్నారు.

కేటీదొడ్డి: మండలంలోని గువ్వలదిన్నె, చింతలకుంట, మల్లాపురంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలోని సోమవారం అయోధ్య రామయ్య అక్షలతో ఘనంగా శోభయాత్ర నిర్వహించారు. అనంతరం ఇంటింటికి అక్షతలు అందజేశారు. విశ్వహిందూ పరిషత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అక్షతలు ఊరేగింపు

అయిజ: అయోధ్యలో శ్రీరాముడి ఆలయ నిర్మాణం ప్రారంభోత్సవం సందర్భంగా దేశంలో ఇంటింటికీ శ్రీరామ అక్షతలు పంపిణీ చేసే కార్యక్రమాన్ని సోమ, మంగళవారాల్లో భక్తులు నిర్వహించారు. మండంలోని ఎక్లాస్‌పురం, బింగుదొడ్డి, యాపదిన్నె గ్రామాల్లో శ్రీరాముడి అక్షతలను ఆంజనేయుడి స్వామి ఆలయం వరకు ఊరేగించారు. కాషాయ వస్త్రాలు ధరించి, కాషాయ జెండాలపై శ్రీరాముడి చిత్రపటాలను ముద్రించి ఊరేగింపు చేశారు.

మానవపాడు: అయోధ్య నుంచి వచ్చిన అక్షతలను రామభక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి మంగళవారం ఇంటింటికీ పంపిణీ చేశారు.



కేటీదొడ్డిలో ఇంటింటికీ తిరుగుతూ అక్షతలు పంపిణీ చేస్తున్న సభ్యులు



యాపదిన్నెలో ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



ఏ.బుడిదిపాడులో ఇంటింటికీ అక్షతలు అందిస్తున్న రామభక్తులు